

జోరుగా గుట్కా దందా

బెంగుళూరు టు నిజామాబాద్

- జిల్లాలో గుట్టుగా గుట్కా విక్రయాలు
- బెంగుళూరు నుంచి జిల్లాకు సరఫరా
- జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలింపు
- పోలీసుల తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న నిల్వలు
- బడా నాయకుల అండదండలతో వ్యాపారుల దందా

ఖిల్లా, జూలై, 23: జిల్లాలో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు వ్యాపారులు దొడ్డిదారిలో దో నెంబర్ దందా కొనసాగిస్తున్నారు. పక్కా ప్రణాళికతో జిల్లా అంతటా జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. బెంగుళూరు నుంచి జిల్లాకు తరలించి నేతల అండదండలతో దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కేసులు నమోదైనా.. అమ్మకాలను ఆపడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు నిర్మల్ జిల్లా సరిహద్దు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు అక్రమ మార్గాన కంటైనర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. బడా వ్యక్తుల సహకారంతో గుట్కాను కొందరు బెంగుళూరు సమీపంలోని తుంకూరు జిల్లా నుంచి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నట్లు సమాచారం. కర్నాటక రాష్ట్రం తుంకూరు జిల్లా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేసి అక్కడ బేగంబజార్‌లోని రహస్య ప్రాంతాల్లోని గోదాముల్లో నిలువ చేసి, అక్కడి నుంచి పాన్‌మసాల రవాణా చేస్తున్న వాహనాల్లో ఇతర ప్రాంతాలకు గుట్కాను తరలిస్తున్నట్లు తెలిసింది. ఒక్కో కంటైనర్‌లో సుమారు రూ.50లక్షల వరకు గుట్కాను రవాణా చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల బాల్కొండ పోలీసులు జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తుండగా సుమారు రూ.22లక్షల పాన్ మసాలకు సంబంధించిన వే బిల్లులను చూపి అక్కడి నుంచి వెళ్లడానికి యత్నించగా, పోలీసులకు అనుమానం వచ్చి కంటైనర్‌ను పూర్తిగా పరిశీలించారు. దీంతో సుమారు రూ. 50లక్షల గుట్కా ఉన్నట్లు పోలీసులు గుర్తించి కంటైనర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులతో..

కొంత కాలం క్రితం సుప్రీం కోర్టు ఉత్తర్వుల వల్ల నిషేధిత గుట్కా బ్యాన్‌ను ఉపసంహరించింది. దీనిని ఓపెన్ మార్కెట్‌లో విక్రయాలు జరుపుకోవచ్చని చెప్పింది. దీంతో అక్రమంగా ఉన్న గుట్కా సక్రమంగా మారింది. ప్రతి ఒక్కరూ దీనిని ఓపెన్ మార్కెట్‌లో తక్కువ ధరలకు విక్రయాలు జరపడం మొదలు పెట్టారు. ప్రతీ పాన్ కోకాలో, కిరాణా దుకాణాల్లో బహిరంగంగా గుట్కా ప్యాకెట్లను పెట్టి అమ్మకాలు జరిపేవారు. అమ్మకాలపై ఎటువంటి ఆక్షేపనలు లేకపోవడంతో పోలీసులు సైతం అటువైపు దృష్టి సారించడం మానివేశారు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు వివిధ రకాల గుట్కాలను తయారు చేసి మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కానీ ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడం వల్ల గుట్కాను తిరిగి నిషేధించడం వల్ల ఈ వ్యాపారం అక్రమంగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో నాసిరకం గుట్కా తయరీకి చెక్ పడింది. కానీ ఈ వ్యాపారంలో ఆరితేరి ఉన్న బడా వ్యాపారులు తిరిగి అక్రమ మార్గాల ద్వారా గుట్కాను జిల్లా కేంద్రానికి రవాణా చేయడం ప్రారంభించారు. గతంలో చిన్న చిన్న వాహనాల్లో రవాణా చేసే అక్రమార్కులు ప్రస్తుతం కంటైనర్ల ద్వారా రవాణా జరుపుతున్నారు. కాగా, గతంలో హైదరాబాద్ కేంద్రంగా ఉండి నడిపిన వ్యక్తి ప్రస్తుతం బెంగుళూరుకు మకాం మార్చుకుని ఈ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆ వ్యక్తి తమకు ఉన్న పాత పరిచయాల ద్వారా అక్రమార్కులతో సంప్రదించి ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిసింది.



బాల్కొండ పోలీసులు పట్టుకున్న గుట్కా కంటైనర్ (ఫైల్)

కఠినంగా వ్యవహరిస్తేనే దందాకు అడ్డుకట్ట..

ప్రతి రోజూ ఏదో ఒక దగ్గర గుట్కాను పట్టుకుని అధికారులు సీజ్ చేస్తున్నా ఈ రవాణా మాత్రం ఆగడంలేదు. పూర్తిస్థాయిలో నిఘా పెడితే తప్ప రవాణా ఆగే పరిస్థితిలేదు. మహారాష్ట్ర, కర్నాటక సరిహద్దుల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టుకుంటే తప్ప రవాణా తగ్గే పరిస్థితిలేదు.

గుట్కా అక్రమ రవాణా ప్రత్యేక చర్యలు..

:రాజవెంకటరెడ్డి, ఏసీపీ (నిజామాబాద్)

నిషేధిత గుట్కా రవాణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. యువత చెడు మార్గాల్లో మాదకద్రవ్యాలకు, గుట్కాకు అలవాటు పడకుండా ఉండేందుకు వారికి అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక సిబ్బందితో నిఘా పటిష్ఠం చేస్తున్నాం. గుట్కా తయారీ కేంద్రాలను గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.



నగర పాలక సంస్థలో భారీగా బదిలీలు

- ఎట్టకేలకు బదిలీ అయిన ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్‌అలీ
- ఎనిమిదేళ్ల అనంతరం టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు

సుభాష్‌నగర్, జూలై 23: నగరపాలక సంస్థలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన బదిలీల ప్రక్రియ మొదలైంది. దశాబ్ద కాలం పాటు నిజామాబాద్ నగర పాలక సంస్థలో పెత్తనం చెలాయిస్తున్న కొందరిపై బదిలీ వేటు పడింది. సాధారణ బదిలీలలోనే ఇతర ప్రాంతాలకు బదిలీ అయినా.. ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తుండటంతో వారి పెత్తనంపై కింది స్థాయి ఉద్యోగులతో పాటు నగర ప్రజలు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరి బదిలీలు ఎప్పుడా అని వేచి చూశారు. ప్రజాప్రతినిధులు సైతం వీరిని బదిలీలు చేయాలని పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కొందరిపై ప్రతీరోజు సోషల్ మీడియాలో వీరి బదిలీలు ఎప్పుడు అంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. ఎట్టకేలకు బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో కొందరు కింది స్థాయి ఉద్యోగులతో పాటు ప్రైవేటు బిల్డర్లు, ఇంజనీర్లు సంబరాలు చేసుకుంటున్నారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు బదిలీలపై వివిధ ప్రాంతాలకు వెళ్లారు. ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది బిల్ కలెక్టర్లు బదిలీ అయ్యారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో..

ఎనిమిది సంవత్సరాలుగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు జరగలేదు. ప్రస్తుతం ఎనిమిదేళ్ల అనంతరం టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు జరిగాయి. టీపీవోగా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్‌గౌడ్ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న అనుపమ కామారెడ్డిలో విధులు నిర్వహించాల్సి ఉండగా డిప్యూటేషన్‌పై నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం నిజామాబాద్‌కు బదిలీ అయింది. టీపీఎస్ వెంకటేశ్ నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం ఆర్మూర్ మూడు రోజులు, బోధన్ మూడు రోజులు విధులు నిర్వహించేలా బదిలీ చేశారు. మరో టీపీఎస్ ప్రవీణ్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు.

ఎట్టకేలకు ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ బదిలీ..

మున్సిపాలిటీగా ఉన్న కాలం నుంచి నగరపాలక సంస్థ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ప్రస్తుత ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా ఉన్న సాజిద్ అలీని ఎంతకాలం కొనసాగిస్తారని ప్రజాప్రతినిధులు అనేక ఆందోళనలు నిర్వహించారు. అయినా తలొగ్గకుండా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా కొనసాగించారు. సాజిద్ అలీ ప్రస్తుత హోదా శానిటరీ సూపర్‌వైజర్ కాగా, సాజిద్‌అలీని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. మేయర్ సీసీగా పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జైకుమార్‌ను బోధన్‌కు బదిలీ చేశారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



ప్రమాదకరంగా మారిన వేల్పూర్-అంక్సాపూర్ ప్రధాన రోడ్డు

- కోతకు గురైన వేల్పూర్-అంక్సాపూర్ రోడ్డు
- వాహనాల రాకపోకలకు తప్పని అవస్థలు

వేల్పూర్, జూలై 23: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. వేల్పూర్ నుంచి అంక్సాపూర్‌కు వెళ్లే బీటీరోడ్డు కొత్తపల్లి(కె) గ్రామ సమీపంలోని నిజాంసాగర్ కెనాల్ పిల్లకాల్వ మినీబ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అలాగే పచ్చలనడ్కుడ నుంచి చేంగల్‌కు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు బుడిగెడు చెరువు కట్ట కింద కోతకు గురైంది. ఈ రోడ్ల మీదుగా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కోతకు గురైన రోడ్ల మరమ్మతులు చేయడంలో ఆర్అండ్‌బీ అధికారులు ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళ ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలకే ప్రమాదకరమని పలువురు వాపోతున్నారు.

చెరువులకు జలకళ

- జిల్లాలోని వాగులు, చెరువుల్లో చేరుతున్న నీరు
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం
- నిజాంసాగర్‌కు మొదలైన వరద

నిజామాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. ఓ మోస్తరు వర్షాలు పడటం వల్ల పలు చెరువుల్లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలో మొత్తం 996 చెరువులు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు పడ్డ వర్షాలతో 89 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. వర్షాలు పడుతుండటం వాగులు పారుతుండటంతో 172 చెరువులు 70 శాతానికి పైగా నిండగా 288 చెరువులు 50 శాతంకు పైగా నీళ్లు చేరాయి. జిల్లాలో 235 చెరువుల్లో 50 శాతంలోపు నీళ్లు చేరగా 212 చెరువుల్లో 25 శాతం లోపు నీళ్లు చేరాయి.

సగటు వర్షపాతం నమోదు

జిల్లాలో వర్షాలు పడుతుండటం వల్ల అన్ని మండలాల పరిధిలో సగటు వర్షం నమోదవుతోంది. జిల్లాలో ఈ వానాకాలం జూన్ నుంచి ఇప్పటి వరకు 353.8 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 456.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. సరాసరి సగటు వర్షపాతం కంటే 103 మిల్లీ మీటర్ల వర్షం ఎక్కువగా పడింది. జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా 19 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలతో ఈ వర్షం నమోదు కాగా 14 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదయ్యింది.

నిజాంసాగర్‌కు మొదలైన వరద..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా కొంత మొత్తంలో వరదనీళ్లు వచ్చి చేరుతున్నాయి. జిల్లాలోని సుమారు లక్షన్నర ఎకరాల వరకు ఈ ప్రాజెక్టు నుంచే ఆయకట్టుకు నీళ్లు అందుతున్నాయి. జిల్లాలోని బోధన్ డివిజన్ పరిధిలోని ఆయకట్టుకు రెండు పంటలకు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1387.98 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులోకి 650 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.286 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో పడుతున్న వర్షాలతో ఈ ప్రాజెక్టులో కూడా నీళ్లు వచ్చే అవకాశం ఉన్నట్లు సాగునీటి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే జిల్లాలో పడుతున్న వర్షాలతో పాటు మంజీరా, గోదావరి, హరిదా ద్వారా వస్తున్న వరద నీటితో ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. క్రమేపి శ్రీరాంసాగర్‌లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టుకు 25,490 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను 1069.9 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 23.122 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి.

• సాలూరా వద్ద ప్రవహిస్తున్న మంజీరా నది





కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపు






- నిరాశ పరిచిన కేంద్ర బడ్జెట్
- ఈసారి జిల్లాకు మొండి చేయి
- కేంద్ర బడ్జెట్‌ను స్వాగతించిన బీజేపీ నేతలు
- పెదవి విరిచిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు

నిజామాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని జిల్లా ప్రజలు పెదవి విరిచారు. విపక్ష నేతలు విమర్శలు చేశారు. బడ్జెట్‌పై పెట్టుకున్న ఆశలు ఫలించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచెయ్యే చూపించిందని వాపోతున్నారు. గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంనుంచి బీజేపీకి ఆశించిన మేర ఎంపీ సీట్లు దక్కడంతో ఈ బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల వరద కురిపిస్తుందని అంతా ఆశించినప్పటికీ మరోసారి రాష్ట్రంపై మోదీ సర్కార్ వివక్షత చూపించిందటూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. కాగా, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, చిన్నపరిశ్రమలు, నిరుద్యోగులు, ఉన్నత విద్యతో పాటు ఉపాధి కల్పన కోసం నిధులను కేటాయించారు. తొమ్మిది అంశాలను తీసుకొని కేటాయించిన ఈ నిధులపై బీజేపీ నేతలు స్వాగతించగా ప్రతిపక్ష నేతలు మాత్రం నామమాత్రం కేటాయింపులు చేశారని విమర్శించారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపు లేవని విభజన చట్టంలో పేర్కొన్న విధంగా నిధులు కేటాయించి చేయలేదని వారు ఆరోపించారు.

అన్ని వర్గాలకు ఉపయోగపడే బడ్జెట్..

: దినేష్‌కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంది. కేంద్రం వికసిత్ భారత్ లక్ష్యంగా తొమ్మిది అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ఎక్కువగా కేటాయింపులు చేసింది. గ్రామీణాభివృద్ధి, మహిళలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

: మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు



బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. కీలక రంగాలకు కేటాయింపులు చేయలేదు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు మొత్తం ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఉపయోగం లేదు. జిల్లా ఎంపీ కూడా నిధులు తెచ్చేందుకు కృషి చేయలేదు.

బడ్జెట్ నిరాశ పరిచింది..

: రమేష్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి:

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ పరిచింది. బోధన్, బీదర్ రైల్వే లైన్ ఏర్పాటు, నిజాంషుగర్ ఫ్యాక్టరీ, జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు సంబంధించి బడ్జెట్‌లో ఊసే లేదు. రాష్ట్ర ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఈ బడ్జెట్ కేటాయింపుపై పట్టించుకోలేదు.

రాష్ట్రానికి తీరని లోటు..

: సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేశారు. ఏపీకి కేటాయింపులు పెంచి రాష్ట్రం పట్ల పక్షపాత ధోరణిని వహించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు పెంచలేదు. కొన్ని రాష్ట్రాలకే కేటాయింపులు చేసి రాష్ట్రానికి మొండిచేయి చూపారు.



ఆమ్‌ఆద్మీ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతుంది

బోధన్‌రూరల్,జూలై23: ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతుందని ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ హైమద్ కలీం అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 1వ వార్డు ఆచన్‌పల్లిలో ఆమ్‌ఆద్మీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణలో పుంజుకుంటుందని వచ్చే సంస్థాగత ఎన్నికలలో పోటీ చేస్తుందన్నారు. ప్రజలు ఆమ్‌ఆద్మీ పార్టీని ఆదరించాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.













పశువుల పాకనా..? జనరల్ ఫంక్షన్ హాలా..?


ఫంక్షన్ హాల్‌లో మేకల దృశ్యం

మోస్రా,జూలై23: మండల కేంద్రంలో పేదలకు ఆసరాగా ఉంటుందని పెళ్లి, చిన్న, పెద్ద శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా ఉండాలని నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ అసంపూర్ణంగా మిగిలి పనులు ఆగిపోతే ఎలా ఉంటుందనే దానికి నిదర్శనమే ఈ మోస్రాలోని జనరల్ ఫంక్షన్ హాల్ ఇక్కడ ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా కొన్నాళ్ల మందు బాబులకు, సిగరేట్, గంజాయి వంటి మత్తు పదార్థాలు స్వీకరించే వారికి అడ్డాగా ఏర్పడగా నేడు పశువులకు పాకగా ఉపయోగించి ఈ నిర్మాణం వృథానే అన్నట్లు గుర్తు చేసుకున్నారు. కొందరు సంబంధిత అధికారులు విచారణ చేసి సంపూర్ణంగా పూర్తి చేసి ఇవ్వాలని మండల ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

ముప్కాల్, జూలై23: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల శివరాజ్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎత్తిచూసి బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్; బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, నర్సయ్య, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తోందని ఆ దిశగా పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని మండల బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగ దేవేం ధర్, గడ్డం రాములు, లింగాల రాముగౌడ్, వాల్గొట్ శేఖర్, మురళీగౌడ్, మోహన్, ప్రకాష్, రమేష్, బోబిడె మోహన్, ర్యాడ మోహన్‌లు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు చేస్తాం

ఏర్గట్ల, జూలై 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీకార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతీమహిళకు రూ.2500, 500లకు సిలిండర్, పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో మండలాధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమ రాజారెడ్డి, మాజీ ఎంపిటీసి బొల్లి శంకర్, బద్ధం సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్,జూలై23: బోధన్ మండలంలోని పెగడాపల్లి రోడ్డులో గల ఇండియన్ పెట్రోల్ బంక్ డీలర్‌ను రూ.30వేల ఇవ్వాలని డిమాండ్ చేసిన నవరత్న సేల్స్ ఆఫీసర్‌లు రాజేష్, క్రాంతిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫౌండర్ ప్రెసిడెంట్ దినేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెగడాపల్లి పెట్రోల్ బంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పెట్రోల్ బంక్‌ల ప్రొప్రేటర్లు పాల్గొని రెండు రోజుల్లో ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఉద్యోగం నుంచి తొలగించకుంటే అన్ని బంక్‌లు బంద్ చేస్తామని డిమాండ్ చేశారు. ఈ నెల 20నాడు ఉదయం 10గంటల సమయంలో పెగడాపల్లి రోడ్డు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు చెకింగ్‌కు వచ్చిన స్టేట్ ఆఫీసర్లు క్షుణ్ణంగా పరిశీలించిలో ఆన్‌లైన్‌లో డెన్సిటీ రికార్డు చేసిన మ్యాన్‌వల్‌గా చేయలేదని టార్గెట్ చేసి బంక్ సీజ్ చేశారన్నారు. పెట్రోల్ బంక్ సీజ్ చేయడం సరికాదని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ నిర్వాహకులు ప్రతాప్ గుప్తా, శశిభూషణ్, వెంకటరమణ, జియాఖాన్, సలీం, విష్ణు, రాకేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





ఇంటర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు

● పక్కా భవనం లేని డిగ్రీ కళాశాల ● జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల తరగతులు ● ఇబ్బందుల్లో విద్యార్థులు


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల భవనం ఇదే


డిచ్‌పల్లిలో డిగ్రీ కళాశాల తరగతి గదులు

డిచ్‌పల్లి, జూలై 23: డిచ్‌పల్లి మండల కేంద్రంలో గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీశాసన సభ్యులు ప్రత్యేక చొరవ చూపి డిచ్‌పల్లి మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించారు. కానీ భవనానికి నిధుల మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాల కోసం కొన్ని తరగతి గదులను కేటాయించారు. ఇరుకుగా మారిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతి గదులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతున్నారు. సరైన మౌలిక సదుపాయాలు లేక క్రీడామైదానం లాంటి సౌకర్యాలు విద్యార్థులకు అందని ద్రాక్ష గానే మారిపోయింది.2023-24 విద్యాసంవత్సరంలో ప్రారంభమై డిగ్రీకళాశాల డిచ్‌పల్లి జూనియర్ కళాశాల భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాలనిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయడంలో అధికారులు,నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అపవాదు వినబడుతుంది. 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో బీఏ,బీకాం, బీఎస్సీ, బీజడ్సీ కోర్సులతో ప్రారంభించారు. ఈ విద్యాసంవత్సరంలో అన్ని కోర్సుల్లో కలిపి 30మంది నూతనంగా ప్రవేశం పొందారు. విద్యార్థులకు బోధన చెప్పేందుకు అధ్యాపకుల కొరత సైత ఇక్కడ తీవ్రంగా వేధిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి వెంటనే స్పందించి డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని, అధ్యాపకులను కేటాయిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిగ్రీ కళాశాల ద్వారా డిచ్‌పల్లి మండలంతో పాటు ఇందల్వాయి,మోపాల్,జక్రాన్‌పల్లి మండలాలకు విద్యార్థులకుసౌకర్యంగా మారనుంది. కావున డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటే చేయాలని కోరుతున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ కళాశాల భవనం ఎదుట కనీసం డిగ్రీ కళాశాల పేరుతో బోర్డుసైతంలేక పోవడం గమనార్హం.డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలతో పాటు రాష్ట్రంలో మం జూరైన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ డిగ్రీకళాశాల వంటి వాటికి ప్రభుత్వం అధ్యాపకులను కేటాయించిన,ఇక్కడి కళాశాలపై మాత్రం నిర్లక్ష్యం చూపి అధ్యాపకులను నియమించలేదు.దీంతో విద్యార్థులకు డిగ్రీ విద్య దూరం అవుతుందని విద్యార్థులు,వారితల్లిదండ్రులు వాపోతున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాలు అందించాలి

● అదనపు కలెక్టర్ అంకిత్


కేజీబీవీలో వంటగదని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

కమ్మర్‌పల్లి, జూలై 23: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచి, సూచి శుభ్రతతోకూడిన భోజనాలు అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, గిరిజన బాలిక విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండిన భోజనాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాలు వేడిగా ఉండే విధంగా చూడాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి తరగతగదులలో విద్యార్థులతో మాట్లాడుతూ..విద్యాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రణాళికబద్ధం చదివితే లక్ష్యాలను చేరుకోవడం ఏమంత కష్టం కాదని సూచించారు. మంచి విద్యబోధించాలని ఇన్‌చార్జి ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్‌కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. తప్పులు దొర్లకుండా లబ్ధిదారుల వివరాలు నమోదుచేయాలని సూచించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామశివారులోని పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. నాగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంసాగర్ వరద కాలువ గట్టుపై కొనసాగుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని పరిశీలించారు. నాగాపూర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ అంకాత్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, ఏపీవో విద్యానంద్, ఏఈ పీఆర్ గట్ల శ్రీనివాసులు, పంచాయితి కార్యదర్శులు శాంతికుమార్, కాందేష్ సంధ్య, ఈజీఎస్ టీఏలు, పంచాయితి సిబ్బంది ఉన్నారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని పరిపాలన భవనం ముట్టడి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


పరిపాలన భవనంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి,జూలై 23:తెలంగాణ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం రెగ్యులర్ వీసీ నియమించాలని, వర్సిటీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో కళాశాల నుంచి మెయిన్ గేట్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పరిపాలన భవనం మూకుమ్మడిగా విద్యార్థులు ముట్టడించి ఆందోళన చేశారు. తెలంగాణ వర్సిటీ సమస్యలు రెగ్యులర్ వీసీ లేకా సమస్యలు పరిష్కరం కావడం లేదని, ఇన్‌చార్జి వీసీ సమస్యలు ఎక్కడిక్కడే ఉండిపోతున్నాయని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి విద్యార్థులు ఏసమ స్యల పరిష్కారానికి వెళ్లిన తన పరిధిలో లేదని తప్పించుకుంటున్నరని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ విమర్శించారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయా లని నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురియింబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు.సెంట్రల్ లైబ్రెరీలో పోటీ పరీక్షలకు అన్ని రకాల పుస్త కాలను అం దుబాటులో ఉంచాలని విద్యార్థులకు ప్లేస్ మెంట్ సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశా రు.నూతన ఆడిటోరియం నిర్మించాలని అన్నారు. విద్యార్థులకు 24గంటల వైద్యసదుపాయం ఉం డేలా చూడాలని, నూతన అంబులెన్స్ ఏర్పా టు చేయలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రం రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీనాయకులు సాయి కు మార్, అవ్వుత్ చారి,రాకేశ్,న వీన్,హరినాథ్,సమీర్, హరికృష్ణ,మోహన్,అక్షయ్,లెనిన్, పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

హాస్టల్‌ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్


టీయూలో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి,జూలై 23:వర్సిటీలోని ఓల్డ్‌బాయ్స్ హాస్టల్‌ను రిజిస్ట్రార్ యా దగిరి మంగళవారం తనిఖీ చేశారు.పరిసరాలను పరిశీలించి వంట గదుల ను శుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారనకు కిటికీ లకు జాలీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఉన్న సమ స్యలను విన్న రిజిస్ట్రార్ పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రిజిస్ట్రార్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఇంజనీర్ వినోద్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో టీకార్స్ క్రాంతి,దింగబర్, రమేశ్ పాల్గొన్నారు.

నేడు కమ్మర్‌పల్లిలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ

కమ్మర్‌పల్లి, జూలై 23: మండలంలోని వివిధ గ్రామాలలోని దివ్యాంగులకు బుధవారం కమ్మర్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో ఆర్టీసీ బస్సుపాస్‌లు జారీ చేయబడతాయని ఏపీఎం కుంటగంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.దివ్యాంగులు బస్‌పాస్‌కోసం ఆర్మూర్ డిపోకు వెళ్లకుండా వారిసౌకర్యార్థ ఆర్మూర్ డిపో మేనేజర్ సహకారంతో ఐకేపీ కార్యాలయంలోనే ఆర్టీసీ సిబ్బంది అర్హులైన విద్యాంగులకు బస్‌పాస్‌లు జారీ చేస్తారని తెలిపారు.ఉదయం 10.30 గంటలకు దివ్యాంగులు వారియొక్క పాతబస్‌పాస్, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 4పాస్ పాస్‌ఫొటోలు తీసుకుని రావా ల్సిందిగా కోరారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో ఒకరి గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 23: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు మంగవారం 21వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 48 విద్యార్థులకు గాను 47 హాజరయ్యారని, ఒక విద్యార్థి గైర్హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు పరీక్షకు హాజరయ్యారని,ఆయన తెలిపారు.

కోటగిరి ఎంపీవోకు ఘనంగా వీడ్కోలు


ఎంపీవోను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,జూలై23:కోటగిరి ఎంపీవో మారుతీనిమండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీవో మారుతీ వర్ని మండలానికి బదిలీ కాగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమేనని ఎంపీడీవో మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగాధర్, మండల పరిషత్ అధికారులు విఠల్, శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాణిజ్య శాస్త్రంలో కామర్స్ విద్యార్థుల ప్రతిభ


టీయూ వాణిజ్యశాస్త్రంలో రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

డిచ్‌పల్లి,జూలై 23: రాష్ట్ర స్థాయి వాణిజ్య శాస్త్రంలో కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కామర్స్ విభాగం ఓయూలో రాష్ట్ర స్థాయిలో ఎంకాం విద్యార్థులకు ప్రతీ ఏటా నిర్వహించే సదస్సు 19,20వ తేదీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో టీయూ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోలో డ్యాన్స్‌లో గంగోత్రి మొదటి బహుమతి పొందగా, గ్రూప్ డ్యాన్స్‌లో రాము బృందం ద్వితీయ బహుమతి సాధించారు. వ్యాపార ప్రణాళిక తయారీలో గోపాల్, హర్షవర్ధన్, ప్రత్యేక బహుమతితో పాటు కేస్ స్టడీస్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిజిస్ట్రార్ అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన కామర్స్ విభాగాదిపతి రాంబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా.శ్రీనివాస్, గంగాధర్, రేఖ, రాజు, పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా బోనాల పండుగ


కల్దుర్కిలో బోనాల పండుగ దృశ్యం


బొప్పాపూర్‌లో బోనాల పండుగను నిర్వహిస్తున్న గ్రామస్థులు

బోధన్‌రూరల్,జూలై23: మండలంలోని కల్దుర్కి గ్రామంలో మంగళవారం గ్రామస్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి బోనాలతో ప్రధాన వీధులగుండా అమ్మవారి ఆలయానికి డప్పువాయిద్యాల మధ్య చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంట చల్లగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగాధర్, మాజీ సర్పంచ్ నానా పటేల్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మి రాజన్న, గ్రామపెద్దలు తుడుం బాబు, మొగులయ్య, హన్మంత్‌రెడ్డి,లక్ష్మణ్, ధర్మయ్య, బాలు, శివ, గంగాధర్, అశోక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● బొప్పాపూర్‌లో బోనాల పండుగ

రుద్రూరు: రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామం లో భక్తి శ్రద్ధలతో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహిం చారు. బోనాలతో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య కన్నుల పండుగ ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని పిల్లా పాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవార్లను వేడుకున్నారు. ఈ బోనాల వేడుకల్లో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పట్ల సురేష్, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


హంగర్గలో బోనాల పండుగ దృశ్యం

కోటగిరి: పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలను డప్పువాయిద్యాలతో ఊరేగించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ పటేల్, గంగాధర్, ప్రకాష్ పటేల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని గ్రామ దేవతల ఆలయాలకు తరలివెళ్లారు. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరె కటికె సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్‌రూరల్,జూలై23: పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సాలూర క్యాంప్ గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1200 స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని, పేకాటకు బానిసలు కావొద్దని ఆయన అన్నారు. గ్రామాలలో పేకాట స్థావరాల ఆచూకీని పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

స్వగ్రామానికి చేరిన వినోద్ మృతదేహం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మెండోరరూరల్, జూలై 23: మండల కేం ద్రానికి చెందిన మాకురి వి నోద్ బెహరాన్ దేశంలో గురువారం మృతి చెందడంతో మృత దేహం మంగళవారం మెండోరకు చేరుకుంది. వినోద్ మృత దేహం చూడగానే మృతుడి కుంటుంబ సభ్యులు బంధువులు గుండెలు పగిలేలా రోదించారు. బెహరాన్‌లో వినోద్ మృతి చెందిన విషయం రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సం స్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, కోటపాటి నర్సింహనాయుడు దృష్టికి తీసుకెళ్లగానే ప్రత్యేక చొరవ తీసుకొని బెహరన్ దేశంలో ఉన్న తెలుగు కళాసమితి సంక్షేమ విభాగం కన్వీనర్ నోములు మురళీ, మాకురి గంగాధర్‌ల సహకారాలతో ఈరవత్రి అనిల్ ఎప్పటి కప్పుడు మా ట్లాడుతూ ఐదురోజుల వ్యవధిలోనే మృతుడి మృతదేహం స్వగ్రా మా నికి చేరుకోవడం జరిగింది. మృతుడి అంత్యక్రియలకు ఈరవత్రి అనిల్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

కోటగిరి ఎంపీవోగా చందర్

కోటగిరి,జూలై23: కోటగిరి ఎంపీవోగా చందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వర్ని మండలం నుండి బదిలీపై ఆయన కోటగిరికి వచ్చారు. కోటగిరి ఎంపీవోగా పని చేసిన మారుతీ వర్ని మండలానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 11మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 23: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రెటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్,ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు మంగళవారం 7వరోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్సకళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో71 మంది విద్యార్థులకుగాను 71 మంది పరీక్షకు హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 159మంది విద్యా ర్థులకు 148 విద్యార్థులు హాజరయ్యారని, 11మంది గైర్హాజరయ్యా రని డైరెక్టర్ పేర్కొన్నారు.

హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,జూలై23: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలోని బాలికల హాస్టల్‌లో హెడ్ కుక్‌గా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావు తెలిపారు. దరఖాస్తుదారురాలు 10వ తరగతి పాసై ఉండాలని, 18సంవత్సరాల నుంచి 45సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, ఆసక్తి గల మహిళలు ఈ నెల 27లోగా మోడల్ పాఠశాల హాస్టల్‌లో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రెంజల్,జూలై23: రెంజల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంపై పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. స్కూల్లోకి వచ్చే పిల్లలకు పౌష్టికాహారం, సమగ్ర అభివృద్ధి అందే తీరును తల్లిదండ్రులకు వివరించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు పోషకాహారం అందించి ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు అందించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్యామల, సీఏలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సురేఖ, సుజాత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పోతంగల్‌లో ఇసుక వేలం


పోతంగల్‌లో డంప్ చేసిన ఇసుక

కోటగిరి,జూలై23: పోతంగల్ మండలంలోని హంగర్గ బైపాస్ సమీపంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌కు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సుమారు 12ట్రాక్టర్ల ఇసుక ఉండడంతో వేలంలో పాల్గొనే వారు 3వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన


కోటగిరి జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ సందీప్

కోటగిరి,జూలై23: యువత గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్ఐ సందీప్ సూచించారు. కోటగిరి జూనియర్ కళాశాలలో మంగళవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చక్కని నాటిక పాటలతో అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా గ్రామాలు సురక్షితంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాలలో వన మహోత్సవం


బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్,జూలై23: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, మానవళి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ ఓడి.రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, వైసచైర్మన్ షేక మున్న, కళాశాల ప్రిన్సిపాల్ దేవరాం, వన మహోత్సవ ఇన్‌చార్జీ వెంకటేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి : ఎక్సైజ్ సీఐ


డొంకేశ్వర్‌లో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ దిలీప్

డొంకేశ్వర్, జూలై23: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ దిలీప్ అన్నారు.వనమహోత్సవంలో భాగంగా మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని కోమటి చెరువు కట్ట నుంచి డొంకేశ్వర లిఫ్టు కెనాల కట్ట వరకు రెండు వేల మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను రక్షించే బాధ్యత తీసుకోవాలనిగౌడసంఘం సభ్యులకు సూచించారు.ఈతమొక్కల యొక్క ప్రాముఖ్యతను ఎక్సైజ్ శాఖ అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులు రామాగౌడ్,గంగాగౌడ్, భూమాగౌడ్, సుధాగౌడ్,గణేష్‌గౌడ్,మహేందర్‌గౌడ్,సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


బాధిత కుటుంబానికి ఎల్‌వోసీని అందజేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, జూలై23: డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామానికి చెందిన అర్గె చంద్ర గత నెల రోజులుగా బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టి నరాల సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవ్యక్తికిరూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చే యించారు. బాధిత కుటుంబం ఆర్థిక స్తోమత గురించి గ్రామ కాంగ్రెస్ నాయకులు బండి గం గాధర్, తలారి రాజన్న, మల్లేష్ గౌడ్‌లు ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డికి వివరించగానే చికిత్స నిమిత్తం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ కాపీని అందజేశారు.

డైట్ కళాశాలలో ఉత్తుత్తి విచారణ!

- విద్యార్థి సంఘాల రాకతో వెనుదిరిగిన ఆర్‌జేడీ

నిజామాబాద్ అర్బన్, జూలై 23: డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు ఓ అధ్యాపకుడు నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు, ఆరోపణలు రాగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వరంగల్ ఆర్‌జేడీని విచారణకు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి డైట్ కళాశాలకు విచారణకు వచ్చారు. కానీ విచారణ సమయంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు కొంత మంది సిబ్బంది మాత్రమే ఉండగా ఫిర్యాదులు చేసిన విద్యార్థులు లేకపోవడం విచారణపై పలు అనుమానాలకు తావిస్తోంది. విచారణ విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు డైట్ కళాశాలకు వెళ్లగా ఆర్‌జేడీ తాను విచారణకు రాలేదని చెప్పినట్లు తెలిసింది. కొంత మంది అనుకూలమైన సిబ్బంది చేత తూతూ మంత్రంగా విచారణ నిర్వహించి వివరాలు ఆర్‌జేడీ తెలుసుకున్నట్లు సమాచారం. డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిష్ట వేసిన శ్రీనివాస్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఒక వర్గానికి చెందిన వారికి వత్తాసు పలుకుతూ మరో వర్గానికి చెందిన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విద్యార్థులు కలెక్టరేట్ వద్ద అనేకమార్లు ధర్నాలు చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అటెండెన్స్ విషయంలోనూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజును కళాశాల అకౌంట్‌లో జమ చేయకుండా వ్యక్తిగతంగా ఓ అధికారి ఖాతాలో జమ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కళాశాల నిధులు 37లక్షలు లెక్క లేకుండా ఏ అవసరాలకు వాడారో కూడా తెలియని పరిస్థితుల్లో కళాశాల ఉంది. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ విషయంలో సీరియస్ అయి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ప్రిన్సిపాల్‌పై కమిషనర్ వరంగల్ ఆర్‌జేడీతో విచారణ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ విచారణ మాత్రం ఏదో తూతూ మంత్రంగా నిర్వహించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రిన్సిపాల్‌పై అనేక ఆరోపణలు ఉండగా కేవలం కొద్దిమంది సిబ్బందిని మాత్రమే విచారించి ఆర్‌జేడీ వెళ్లడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్‌జేడీ విచారణకు వచ్చిన విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు కళాశాలకు వెళ్లగా అప్పటికే ఆర్‌జేడీ వెళ్లిపోయినట్లు సమాచారం.



విద్యార్థుల సమక్షంలోనే విచారణ జరపాలి..

డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలను కళాశాలలో చదువుతున్న శిక్షణ ఉపాధ్యాయుల సమక్షంలోనే విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌జేడీని కలిసి మాట్లాడారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మానసికంగా వేధించడంతో పాటు 34 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారని ఇది నిబంధనలకు విరుద్ధమని గణేష్ అన్నారు. ఆర్‌జేడీ విచారణకు రావడం స్వాగతిస్తున్నామని కానీ విద్యార్థులంతా టీచింగ్ ప్రాక్టిస్ కోసం వివిధ పాఠశాలలకు వెళ్లడం అలాగే డీఎస్సీ కోసం పరీక్షలకు వెళ్లడం జరిగిందని, కావున ఈ విచారణను విద్యార్థుల సమక్షంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.



భండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఊర పండుగ సందర్భంగా 'భండార్'

నిజామాబాద్ అర్బన్, జూలై 23: ఈనెల 28న నిర్వహించనున్న ఊరపండుగ సందర్భంగా సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖిల్లా వద్ద భండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ్‌కిసాన్ మున్నూరుకాపు సంఘం గాజుల్‌పేట్, ఎల్లమ్మగుట్ట మున్నూరు కాపుసంఘం ఆధ్వర్యంలో భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరపండుగకు ముందు భండార్ పోయడం ఆనవాయితీగా వస్తోంది. పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలతో పశుసంపద దిన దినాభివృద్ధి చెందాలని ఏ దృష్టశక్తులు ప్రజలపై పడవద్దని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పసుపు కుంకుమ చల్లి, కొబ్బరికాయలు కొట్టి, కల్లుసాక పోసి దున్నపోతును ఊరుమీద వదిలివేయడం ఆచారంగా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ కోకన్వీనర్ ఆదె ప్రవీణ్, సుంకటి ప్రవీణ్, వెంకటరమణ, గంగాధర్, గోపి, నర్సయ్య, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలతో డీఈవో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్ అర్బన్, జూలై 23: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ ఆఫీసర్లు, టీఎస్ఎంఎస్ ప్రిన్సిపాళ్లు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం అమలు, ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాటు, లీవ్ మానిటరింగ్ రిజిస్టార్, శిక్ష సప్తాహ, వన మహోత్సవం, యుడిఐఎస్‌ఈ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, యూనిఫామ్‌లు, పుస్తకాల పంపిణీ, కెజిబివిలు, బాలికల వసతిగృహాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై డీఈవో ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీసీఈబీ సీతయ్య, సీఎంవో శ్రీనివాస్‌రావు, ఏఎస్‌వో జీవన్, కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, జూలై 23: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ ఫోన్ 08462-220183 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కంట్రోల్ రూమ్ నిరంతరం 24/7 పనిచేస్తుందని ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలపవచ్చన్నారు. సమాచారం అందిన వెంటనే వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, జూలై 23: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 25న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మెడ్‌ప్లస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో ఫార్మసిస్ట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాలు చేయడం జరుగుతుందని 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఫార్మసీ, ఎంఫార్మసీతో పాటు పీసీఐ పాసైన వారు అర్హులని ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లోగల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఈనెల 25న ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం వరకు ఉద్యోగమేళా నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులు రెజ్యూమ్, బయోడాటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫోటోలతో హాజరుకావాలని ఇతర వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నిజామాబాద్ అర్బన్, జూలై 23: రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలలో మిగిలిన అన్ని ప్రమోషన్ల ఖాళీలను, సీనియారిటీ జాబితాను 1:1 నిష్పత్తి క్రమంలో ప్రదర్శించి జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ డీఈవో.నిజామాబాద్.కామ్.ఇన్‌లో పొందుపర్చడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాలో 2 అంతకన్న ఎక్కువ సబ్జెక్టు సీనియారిటీ జాబితాలలో ఉన్న ఉపాధ్యాయులు వారు తీసుకొనదలచిన ప్రమోషన్ సబ్జెక్టుకు ఈనెల 24న ఉదయం 10గంటలకు డిక్లరేషన్ ఇవ్వవల్సి ఉంటుందని ఆన్‌లైన్ వెబ్‌ఆప్షన్ ప్రమోషన్లలో నో ఆప్షన్ ఉండదని చివరిగా మిగిలిన పోస్టు కూడా కేటాయించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.



తీజ్ పండుగలో పాల్గొన్న యువతులు

మల్కాపూర్ తండాలో తీజ్ పండుగ

నిజామాబాద్ రూరల్, జూలై 23: రూరల్ మండలం మల్కాపూర్ తండాలో తీజ్ పండుగ ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మంగళవారం గ్రామంలోని సేవాలాల్ మహరాజ్, రామారావు మహరాజ్ గుళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటికి ఒకరు చొప్పున మహిళలు తీజ్ తీశారు. పెళ్లికాని యువతులు తీజ్‌ను ఇంటినుంచి తీసుకుని నెత్తిమీద పెట్టుకుని వీధుల్లో ఊరేగింపు తీశారు. అనంతరం తీజ్‌ను చెరువులో చేశారు. ప్రతీసంవత్సరం మాదిరి ఈ సారి కూడా తీజ్ పండగు వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేతావత్ హరినాయక్, విఠల్, కెతావత్ ప్రకాష్‌నాయక్, మున్ని నాయక్, విఠల్ నాయక్, మోతీ నాయక్, గంగారాం నాయక్, లాల్యా నాయక్, రూపుసింగ్ నాయక్, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 23: నగరంలోని దుబ్బ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. నగరంలోని దుబ్బ ఏరియా, అంబేద్కర్ కాలనీ, శివాజీచౌక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగరంలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- మొదటి రోజు 52 వాహనాలు స్వాధీనం

ఖిల్లా,జూలై, 23: నగరంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు మంగళవారం నుంచి మొదలు పెట్టారు మొదటి రోజు నగరంలోని అయా పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 52 వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ ఆదేశాల మేరకు నగరంలో 18 ప్రాంతాలను గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారయణల నేతృత్వంతో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది నగరంలోని ఆయా ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలను పట్టుకుని సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. రాంగ్‌రూట్‌ల్లో ప్రయాణం చేసిన, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. నడిపిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్‌డ్రైవ్ ప్రతి రోజు కొనసాగుతుందని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారయణ తెలిపారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

పెద్దబజార్, జూలై 23: ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగే సీపీఐ ఉమ్మడి జిల్లాల శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు నగరంలో జరుగుతాయని ఈ శిక్షణ తరగతులకు మొదటి రోజు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు.



మౌలాలి చెరువును పరిశీలిస్తున్న ఈఈ అశోక్‌కుమార్

మౌలాలిచెరువు పరిశీలన

నిజామాబాద్ రూరల్, జూలై 23: రూరల్ మండలం మల్కాపూర్ తండా గ్రామానికి చెందిన మౌలాలి చెరువును ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "మౌలాలి చెరువుకు పొంచిఉన్న ముప్పు" అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించారు. మంగళవారం ఉదయం ఇరిగేషన్ ఈఈ అశోక్‌కుమార్, డీఈ బాలరాజు, ఏఈ శ్రీనివాస్‌లు మౌలాలి చెరువు కట్టను పరిశీలించారు. గ్రామపెద్దలను, రైతులను స్థానిక నేతలను, మాజీ సర్పంచ్ కేతావత్ ప్రకాష్ తదితరులను చెరువు వద్దకు పిలిచించారు. మరమ్మత్తు పనులు దక్కించుకున్న గుత్తేదారు బత్తుల శ్రీనివాస్‌తో మాట్లాడించారు. మరమ్మతు పనులు ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. వేసవి కాలంలోనే మరమ్మత్తులు పూర్తిచేయాలని గుత్తేదారును ఆదేశించానని, పనులు జాప్యం చేయడంతో నోటీసులు సైతం ఇచ్చానని డీఈ బాలరాజు ఈఈ అశోక్ కుమార్‌కు వివరించారు. గ్రామస్తులు సైతం పలుమార్లు గుత్తేదారుకు చెప్పినా వినలేదని, ఆయన ఇతర కాంట్రాక్టులతో బిజీగా ఉంటూ ఈ పనులు నిర్లక్ష్యం చేశారని ఈఈకు ఫిర్యాదుచేశారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేయాలని ఈఈ అశోక్‌కుమార్ గుత్తేదారును ఆదేశించారు. వర్షం పడకపోతేనే పనులు మొదలెడతానని గుత్తేదారు చెప్పడంతో ఈఈ ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులు చేయనప్పుడు కాంట్రాక్టు ఎందుకు తీసుకున్నావన్నారు. పనులు వెంటనే చేయకపోతే గుత్తేదారు పేరు బ్లాక్ లిస్టులో పెడతానని, కొత్త వారికి పనులు అప్పగిస్తామని హెచ్చరించారు. ప్రమాదాన్ని గమనించి స్వల్ప మరమ్మతులకు ముందుకు వచ్చిన స్థానికులను అధికారులు అభినందించారు. ఇరిగేషన్ అధికారులతో గ్రామస్థులు నునావత్ సురేష్, దాదురావ్, మాజీ ఎంపీటీసీ గంగారాం నాయక్, నాతారాంనాయక్, బానోతు సంతోష్ నాయక్, బానోతు హరిచంద్ నాయక్, చందు నాయక్ తదితరులు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.

'ప్రజా సమస్యలపై కదిలించాలి'

పెద్దబజార్, జూలై 23: ప్రజాసమస్యలపై ప్రజలను పోరాటాల్లోకి కదిలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి సొంతంగా మెజార్టీ రాకుండా మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి నెట్టివేయబడ్డాయని అయినప్పటికీ ప్రజల్లో మతతత్వ భావజాలాన్ని పెంచి ప్రజావ్యతిరేక విధానాలతో ముందుకు పోవాలని ఆలోచిస్తున్నారని అన్నారు. మతతత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల సమస్యలపై పోరాటాల్లోకి దించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యురాలు రమ, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, శంకర్‌గౌడ్, నూర్జహాన్, వెంకటేశ్, సభ్యులు గంగాధర్, నన్నెసాబ్, సుజాత, రాములు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

ధర్పల్లి, జూలై 23: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలను జాగృతం చేయాలన్నారు. గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసూతి రిజిస్టర్‌ను పరిశీలించి తగు సూచనలు అందించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, రమేష్, అరుణ, నారాయణ, కృష్ణ, నిర్మల, పద్మ, జయ, వాజిద్, సంతోష్ ఉన్నారు.

క్షయ లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రతిమరాజ్

పెద్దబజార్, జూలై 23: క్షయ లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గాలి ద్వారా సంక్రమించే వ్యాధుల్లో క్షయ వ్యాధి ప్రధానమైందని రాత్రిపూట చెమటలు, జ్వరం, దీర్ఘకాలిక దగ్గు, ఆకలి మందలించడం, నిద్రలేమి, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే క్షయ పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. ఒకవేళ టీబీ నిర్ధారణ అయితే ఆందోళన చెందకుండా చికిత్స చేయించుకోవాలన్నారు. డాక్టర్ పార్థసారధి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 185 క్షయవ్యాధి నిర్మూలన కేంద్రాలలో నిజామాబాద్ ఒకటి అన్నారు. ప్రతీవారం హెచ్‌ఐసీసీ ద్వారా సమీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ భరత్‌కుమార్, ప్రమోద్‌రెడ్డి, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్

పెద్దబజార్, జూలై 23: నగర పాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ మంద మకరంద్ నగరంలోని దుబ్బ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. దుబ్బ ప్రాంతంలోని పీహెచ్‌సీ సెంటర్ ప్రాంగణంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల పనితీరును పరిశీలించారు. మెడిసిన్‌లు అందుబాటులో ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్

సుభాష్‌నగర్, జూలై 23: నగరంలోని 19వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నగర మేయర్ దండు నీతూ కిరణ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. నగరంలోని కంఠేశ్వర్ లోగల రోకడ హనుమాన్ ఆలయం వద్ద 3లక్షల నిధులతో నిర్మించే సీసీ డ్రైనేజీ పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతున్నాయని అన్నారు. నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మీసాల సవిత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మేయర్

సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

ఖిల్లా, జూలై 23: నగరంలోని ఆర్యనగర్‌లోగల శ్రీ-మార్ట్ సూపర్ మార్కెట్ అగ్నికి ఆహుతి అయింది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంగళవారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే మార్ట్‌లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10లక్షల విలువ చేసే వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు తెలిపారు.



శ్రీమార్ట్ అగ్ని ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు

నగరంలోని నాల్గొటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల శ్రీమార్ట్ అగ్ని ప్రమాదంపై నిర్వాహకురాలు శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా లేక ఎవరైన కావాలని ప్రమాదం కల్పించారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

'రాంగోపాల్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటు'

పెద్దబజార్, జూలై 23: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అంకితభావంతో అందరికి అండదండగా ఉంటూ పార్టీకి కార్యకర్తలకు సేవలందించిన కాటిపల్లి రాంగోపాల్‌రెడ్డి మరణం బీజేపీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మినారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాంగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, బాల్‌రాజ్, బద్దం లింగారెడ్డి, న్యాలంరాజు, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
: భారతీయుడు-2 (2.45)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
స్క్రీన్-2 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.45, 1.50, 7.25, 10.30)
: కిల్ (హిందీ) (4.55)
స్క్రీన్-3 : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
: డార్లింగ్ (1.05, 7.00, 10.20)
: జస్ట్ ఎ మినిట్ (4.25)
స్క్రీన్-4 : డార్లింగ్ (10.40)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (2.00, 7.30)
: ది బర్త్‌డే బాయ్ (4.50)
: పేక మేడలు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (12.35, 4.00, 7.25)
: డార్లింగ్ (10.50)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (4.20, 10.45)
: కల్కి (తెలుగు) (10.00)
స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (10.50)
: భారతీయుడు-2 (1.00, 7.20)
: డార్లింగ్ (4.25)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : క్రైమ్ రీల్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్